సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 15 । ఏప్రిల్ । 2023



అవార్డుల పంట

తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి పలు విభాగాల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి అవార్డులు అందుకుంది.

8లో ▸



చిరుధాన్యాలతో ఆరోగ్యం

వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ ఉద్యాన పంటల మేళవింపుతో హార్టీ మిల్లెట్ ఉత్పత్తుల రూపకల్పన చేపడుతోంది.

8లో ▸



విద్యుదాఘాతంతో మృతి

ద్వారకాతిరుమలలో విద్యుదాఘాతంతో స్తంభంపై నుంచి కింద పడి అసిస్టెంట్ లైన్‌మేన్ మృతిచెందాడు.

8లో ▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శనివారం సాయంత్రం)	సహరి (ఆదివారం వేకువజాము)
భీమవరం	6.26	4.25
తాడేపల్లిగూడెం	6.28	4.35
నరసాపురం	6.26	4.24

న్యూస్‌రీల్

అగ్నిమాపక వారోత్సవాలు



వాహనాల ర్యాలీని ప్రారంభిస్తున్న శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు

సాక్షి, భీమవరం: అగ్నిమాపక వారోత్సవాల ద్వారా ప్రజల్లో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించాలని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. శుక్రవారం అగ్నిమాపక వారోత్సవాలను భీమవరం అగ్నిమాపక కేంద్రం వద్ద ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. ప్రధానంగా వేసవిలో అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అగ్నిమాపకశాఖ అమరవీరుల స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకుని పరేడ్ వందనం స్వీకరించారు. అనంతరం వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించి జెండా ఊపి అగ్నిమాపక వాహనాల ర్యాలీని ప్రారంభించారు. జిల్లా అగ్నిమాపకాధికారి బి.శ్రీనివాసరావు, సహాయ జిల్లా అగ్నిమాపకాధికారి సీహెచ్ సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత అంబేడ్కర్



నూజివీడులో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభలో మాట్లాడుతున్న మంత్రి మేరుగ

నూజివీడు: దేశంలోని ప్రతి పౌరుడికి స్వేచ్ఛ, సమానత్వం కోసం కృషి చేసి రాజ్యాంగం ద్వారా హక్కులు కల్పించిన గొప్ప వ్యక్తి, స్ఫూర్తి ప్రదాత బీఆర్ అంబేడ్కర్ అని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. పట్టణంలోని బాపూనగర్‌రోడ్డులో ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావుతో కలిసి శుక్రవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మట్లాడుతూ అంబేడ్కర్‌ను ప్రజలు నిత్యం స్మరించుకోవాలన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగానే సీఎం జగన్ ముందుకు సాగుతున్నారన్నారు. దీనిలో భాగంగా కులాలు, మతాలు, పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ విద్య ద్వారానే జీవితాల్లో మార్పు సాధ్యమవుతుందనడానికి అంబేడ్కర్ జీవితమే మంచి ఉదాహరణ అని అన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేస్తోందన్నారు. అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

జేసీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన రామసుందర్‌రెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఎస్.రామసుందర్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ జేసీగా పనిచేసిన జేవీ మురళీ బదిలీ కాగా కర్నూలు జేసీగా పనిచేస్తున్న రామసుందర్‌రెడ్డి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఆయనకు డీఆర్వో కె.కృష్ణవేణి, ఆర్డీఓ దాసి రాజు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ డి.అఖిల, కలెక్టరేట్ ఏఓ వై.దుర్గాకిషోర్ తదితరులు అభినందనలు తెలిపారు.

మోటార్ సైక్లిస్ట్ మృతి

తాడేపల్లిగూడెం రూరల్: ట్రాక్టర్ వెనుక చక్రం కింద పడి మోటారు సైక్లిస్ట్ మృతి చెందిన ఘటన వెంకట్రామన్నగూడెంలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకట్రామన్నగూడేనికి చెందిన బొట్టా వెంకటరత్నం (42) రోజూ తన మోటారు సైకిల్‌పై ఉద్యాన విశ్వవిద్యాలయంలో పనికి వెళ్తుంటాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం పనికి వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై పడిపోయిన వెంకటరత్నం తలపై నుంచి ట్రాక్టర్ వెనుక చక్రం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుమారుడు రాజేష్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఏఎస్సై పీవీకే దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అందమైన ఇళ్లు.. ఆనందాల సవ్వాళ్లు

స్వగృహమస్తు
- సర్వాంగ సుందరంగా జగనన్న లేఅవుట్లు
- మెగా కాలనీల నిర్మాణం
- వేగంగా నిర్మాణ పనులు
- పుష్కలంగా నిధులు, నిర్మాణ సామగ్రి
- రాష్ట్రంలో మూడో స్థానంలో ఏలూరు జిల్లా

సాక్షి ప్రతినిధి, ఏలూరు: అందమైన ఇల్లు ప్రతి ఒక్కరి కల.. పేదవాడికి సొంతిల్లు ఓ వరం.. అలాంటి సొంతింటి కలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు సాకారం చేస్తోంది. రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ జగనన్న లేఅవుట్లలో ఇంటి స్థలం మంజూరు చేయడంతో పాటు సీసీ రోడ్లు, విద్యుత్, తాగునీరు, పార్కులు వంటి మౌలిక వసతులు కల్పిస్తోంది. అలాగే సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి కూడా లబ్ధిదారులకు సాయం అందిస్తోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా ఇంటి నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే వేలాది నిర్మాణాలు పూర్తికాగా గృహప్రవేశాలు చేసుకుని లబ్ధిదారులు సంతోషంగా జీవిస్తున్నారు. మున్సిపాల్టీ, నగరపాలక సంస్థ పరిధిలో విలువైన స్థలాలు, మరికొన్ని మండలాల్లో జాతీయ రహదారి వెంబడి ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో భూముల విలువ కూడా భారీగా పెరుగుతోంది. ఇంటి నిర్మాణాలు పూర్తి చేసిన పురోగతిలో రాష్ట్రంలో ఏలూరు జిల్లా మూడో స్థానంలో నిలిచింది.



ఏలూరు శనివారపుపేట జగనన్న కాలనీలో ఇళ్లు



ఆకివీడు మండలం కుప్పనపూడి శివారు తాళ్లకోడు జగనన్న లేఅవుట్‌లో నిర్మాణాలు



ఏలూరు శనివారపుపేటలో సుందర నిర్మాణం

అన్నిరకాలుగా ప్రోత్సాహం

ప్రభుత్వం అర్హులైన పేదలకు లేఅవుట్లలో ఉచితంగా స్థలం అందిస్తోంది. పట్టణ ప్రాంతంలో సెంటు, రూరల్ ప్రాంతంలో సెంటున్నర భూమితో పాటు రూ.1.80 లక్షలను పూర్తి సబ్సిడీ రూపంలో అందిస్తున్నారు. అలాగే నిర్మాణానికి అవసరమైన సిమెంట్, ఐరన్, ఎలక్ట్రికల్ సామాన్లను రాయితీపై అందిస్తున్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో 90 రోజుల ఉపాధి హామీ పథకం పనులు కేటాయించి ఒక్కో కుటుంబానికి రూ.30 వేల వరకు అదనపు లబ్ధిని చేకూరుస్తున్నారు. డ్వాక్రా సంఘంలోని మహిళలకు అదనపు ఇంటి రుణం మంజూరు చేస్తున్నారు.

సీఎంకు రుణపడి ఉంటాం



నా భర్త ముఠా కూలీ. ఇద్దరు ఆడబిడ్డలు. పదేళ్లుగా అద్దె ఇంట్లో నివాసముంటున్నాం. సంపాదించిన సొమ్ములో సగం ఇంటి అద్దెకు ఖర్చయ్యేది. సీఎం జగన్ పుణ్యమా కైకలూరు జగనన్న గ్రీన్ విలేజ్‌లో స్థలాన్ని కేటాయించారు. ప్రభుత్వం ఇచ్చిన సొమ్ముతో ఇంటి నిర్మాణం పూర్తిచేశాం. ఇంటి వద్ద చిన్న బడ్డీ కొట్టు పెట్టుకున్నా. సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం.

– కడవళ్ల వసంతలక్ష్మి, కైకలూరు

సొంతింట్లో సంతోషంగా..



30 ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నా. సీఎం జగన్ మాకు స్థలం కేటాయించారు. రూ.2.50 లక్షల విలువైన సెంటున్నర స్థలం ఇచ్చారు. ఇళ్ల నిర్మాణానికి రూ.1.80 లక్షల ఆర్థిక సాయం అందించారు. అలాగే రూ.35 వేల రుణాన్ని ఇచ్చారు. మిగిలిన సొమ్ములు వేసుకుని ఇంటి నిర్మాణం పూర్తిచేసుకున్నాం. సొంతింట్లో సంతోషంగా జీవిస్తున్నాం. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– ఆర్.కనకదుర్గ, పెదపాడు

ఏలూరు జిల్లాలో 88,190 ఇళ్లు

ఏలూరు జిల్లాలోని 738 లేఅవుట్లలో 60,608 ఇళ్లు, సొంత స్థలాల్లో 27,582 ఇళ్లు మొత్తంగా 88,190 గృహాలు మంజూరు కాగా 84,630 నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఏలూరు డివిజన్‌లో 457 లేఅవుట్లు, సొంత స్థలాల్లో 60,042 ఇళ్లు, నూజివీడు డివిజన్‌లో 137 లేఅవుట్లు, సొంత స్థలాల్లో 14,628 ఇళ్లు, జంగారెడ్డిగూడెం డివిజన్‌లో 144 లేఅవుట్లు, సొంత స్థలాల్లో 13,520 ఇళ్లు మంజూరయ్యాయి. ఇప్పటికే ఏలూరు డివిజన్‌లో 13,665, నూజివీడు డివిజన్‌లో 3,712, జంగారెడ్డిగూడెం డివిజన్‌లో 4,682 ఇళ్లు మొత్తంగా 22,059 నిర్మాణాలు పూర్తయ్యాయి. 39,134 ఇళ్లు శ్లాబ్‌ల స్థాయిలో పురోగతిలో ఉన్నాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

రూ.541.44 కోట్లు

ఏలూరు జిల్లాలో ఇళ్ల నిర్మాణం కోసం గృహనిర్మాణ శాఖ రూ.541.44 కోట్లు ఖర్చు చేసింది. ఏలూరు డివిజన్‌లో రూ.330.09 కోట్లు, నూజివీడు డివిజన్‌లో రూ.97.37 కోట్లు, జంగారెడ్డిగూడెం డివిజన్‌లో రూ.113.97 కోట్లు వెచ్చించింది. ముఖ్యంగా భోగాపురం, శనివారపుపేట, కైకలూరు, అప్పనవీడు, ఉంగుటూరులోని లేఅవుట్లు సర్వాంగ సుందరంగా తయారయ్యాయి. 1,500 పైగా ఇళ్లు ఉంటే ప్రభుత్వం అదనపు సౌకర్యాలు కల్పిస్తోంది. లేఅవుట్లలో గ్రే వాటర్ (వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)ను కూడా ఏర్పాటుచేస్తున్నారు. మొదటి విడతలో 208 లేఅవుట్లలో 13,663 ఇళ్లకు ఉపయుక్తంగా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇళ్ల నిర్మాణానికి నిధులు, మెటీరియల్ కొరత లేకపోవడంతో పనులు వేగంగా జరిగేలా అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

'పశ్చిమ'లో శరవేగంగా..

పశ్చిమగోదావరి జిల్లాలో ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. మొత్తం 603 లేఅవుట్లలో 71,864 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటివరకు 20,404 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యింది. ఇందుకు ప్రభుత్వం రూ.404 కోట్లు ఖర్చు చేసింది. ముఖ్యంగా భీమవరం, ఆకివీడు, తణుకు, పాలకొల్లు, భగేశ్వరం, పోడూరు, విస్సాకోడేరు లేఅవుట్లలో నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

కమనీయం.. ఎదుర్కోలు ఉత్సవం



ఉత్సవమూర్తులకు హారతులిస్తున్న అర్చకుడు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్ర ఉపాలయం లక్ష్మీపురం ఆలయంలో శ్రీనివాసుడి దివ్య కల్యాణ మహోత్సవాలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు నిర్వహించిన ఎదుర్కోలు ఉత్సవం కనువిందు చేసింది. ఉదయం ఆలయ యాగశాలలో అర్చకులు, పండితులు, ఆగమ విద్యార్థులు హోమాది కార్యక్రమాలను జరిపారు. అలాగే ఆలయ ఆవరణలో శ్రీనివాసుడు, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి ప్రత్యేక అలంకారాలు చేసి, హారతులిచ్చారు. స్వామి కల్యాణం నిర్వహించే ముందు రోజు వధూవరుల తరఫు బంధువులు శుభలేఖను పఠించేందుకు జరిపే కార్యక్రమమే ఎదుర్కోలు ఉత్సవమని పండితులు అన్నారు.

నేడు శ్రీనివాసుని కల్యాణం

శ్రీనివాసుని దివ్యకల్యాణ మహోత్సవాన్ని శనివారం రాత్రి అట్టహాసంగా జరుపనున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. కల్యాణ మండప ప్రాంతాన్ని విద్యుద్దీపాలు, పుష్పమాలికలు, మామిడితోరణాలు, అరటి బోదెలతో సుందరీకరించారు.

ప్రపంచ మేధావి అంబేడ్కర్

ఘనంగా జయంతి వేడుకలు

భీమవరం (ప్రకాశం చౌక్): దేశ భవిష్యత్తుని నిర్ణయించిన గొప్ప నేత, మహా మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం అంబేడ్కర్ 132వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా కలెక్టరేట్ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహానికి మోషేన్‌రాజు, కలెక్టర్ ప్రశాంతి, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మోషేన్‌రాజు మాట్లాడుతూ మానవ అభివృద్ధితోనే సమాజ, దేశాభివృద్ధి సాధ్యమని అంబేడ్కర్ భావించారన్నారు. మానవాభివృద్ధికి చదువు ఒక్కటే మార్గమని తెలియజేయడంతో పాటు అసమానతలపై అలుపెరుగని పోరాటం చేశారన్నారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ అంబేడ్కర్ వ్యక్తి కాదు శక్తి అని, ఆయన గొప్ప సంఘ సంస్కర్త అని అన్నారు. జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ మాట్లాడుతూ అందరికీ సమాన అవకాశాలు, సమాన హక్కుల కోసం అంబేడ్కర్ పోరాటం చేశారన్నారు. సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ, డీఆర్వో కె.కృష్ణవేణి, అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, రాష్ట్ర సంచార జాతుల కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శోభారాణి, ఆర్డీఓ దాసి రాజు, డీఎస్పీ బి.శ్రీనాథ్, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ దేవరకొండ అఖిల తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం

తాడేపల్లిగూడెం అర్బన్: దేశంలోని ప్రతి పౌరుడుకీ రక్షణ, హక్కులు కల్పించేలా రాజ్యాంగాన్ని రచించిన మేధావి అంబేడ్కర్ అని ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెంలోని పోలీస్ ఐలాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువత అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. బోణం విజయనిర్మల, పత్సమట్ల సావిత్రి, కొలుకులూరి ధర్మరాజు, రామిరెడ్డి రామారెడ్డి, బొద్దు సాయిబాబా, కోడే అప్పారావు, బొద్దాని శ్రీను, సింగం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మండలి చైర్మన్ మోషేన్‌రాజు, కలెక్టర్ ప్రశాంతి



తణుకులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తాడేపల్లిగూడెంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి

తణుకు అర్బన్: దేశానికి దశ, దిశ చూపిన స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్ అని, ఆయన ఆశయ సాధనకు అందరూ కృషిచేయాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు ఇరగవరం రోడ్డులోని 3వ నంబర్ మున్సిపల్ పాఠశాల ఆవరణ, ఎన్టీఆర్ పార్కు ప్రాంతం, మున్సిపల్ కార్యాలయ ప్రాంతంలోని అంబేడ్కర్ విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం కారణంగానే తనకు రాజకీయ భవిష్యత్తు ఏర్పడిందన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితో వైఎస్సార్, ఆయన తనయుడు సీఎం జగన్ ఇచ్చిన అవకాశాలతోనే తాను జెడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, మంత్రిగా రాజకీయ జీవితంలో విజయపరంపర కొనసాగిస్తున్నానని అన్నారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, పార్టీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, నాయకులు పాల్గొన్నారు.

ఎస్పీ ఘన నివాళి

సాక్షి, భీమవరం: అంబేడ్కర్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ అన్నారు. స్థానిక జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఏవీ సుబ్బరాజు, ఆర్మడ్ డీఎస్పీ ఎం.సత్యనారాయణ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మోజస్ పాల్గొన్నారు.

నేడు కాలువల మూసివేత

- జిల్లాలో చురుగ్గా మోటార్లతో చెరువుల్లోకి నీటి తోడకం
- 20 మండలాల పరిధిలో 409 గ్రామాల్లో చెరువులు
- తిరిగి జూన్ 1న కాలువల ద్వారా సాగునీటి విడుదల



కొవ్వాడలో మంచినీటి చెరువును నీటితో నింపుతున్న దృశ్యం

సాక్షి, భీమవరం: జిల్లాలోని పంట కాలువలకు శనివారం నుంచి సాగునీటి సరఫరా నిలిపివేయనుండటంతో గ్రామాల్లో మంచినీటి చెరువులను ఆగమేఘాలపై నింపుతున్నారు. జిల్లాలోని 20 మండలాల పరిధిలో సుమారు 409 గ్రామ పంచాయతీల్లోని మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపుకోవాలని ఇప్పటికే జిల్లా పంచాయతీ అధికారులు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలివ్వడంతో ఆ మేరకు మంచినీటి చెరువులను నింపేందుకు విద్యుత్ మోటార్లు, ఆయిల్ ఇంజిన్లు ఉపయోగించి చెరువులను నింపుతున్నారు. ఇప్పటికే అనేక పంచాయతీ చెరువులను పూర్తిస్థాయిలో నీటితో నింపగా, మిగిలిన పంచాయతీల్లో కూడా నింపే పనిలో నిమగ్నమై ఉన్నారు. జూన్ 1వ తేదీన తిరిగి కాలువలకు నీటిని విడుదల చేయనుండడంతో అప్పటివరకు గ్రామాల్లో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా పంచాయతీల్లో ఒక పూట బోరు నీరు, రెండో పూట చెరువునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటుంటే మిగిలిన గ్రామాల్లో చెరువుల సామర్థ్యాన్ని బట్టి మంచినీరు సరఫరా చేయనున్నారు. అయితే ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడంతో చెరువుల్లోని నీరు ఆవిరయ్యే అవకాశం ఉన్నందున 45 రోజులపాటు నీటిని పొదుపుగా వాడుకోవాలని పంచాయతీల్లో ప్రచారం చేస్తున్నారు.

దాళ్వా వరికి చివరి తడి పెట్టుకోవాలి

జిల్లాలో 2.19 లక్షల ఎకరాల్లో దాళ్వాసాగు చేయగా ఇప్పటికే చాలా ప్రాంతాల్లో మాసూళ్లు ప్రారంభమయ్యాయి. ఆలస్యంగా నాట్లు వేసి చేలల్లో ప్రస్తుతం గింజ గట్టిపడి ఎర్రముక్కులు పండే దశలో ఉండడంతో వరిచేలకు సాగునీటి అవసరం ఉండదని వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు. కాలువలకు నీటి సరఫరా నిలిపివేసినా మరో రెండు, మూడు రోజుల్లో కాలువల్లో నీరు ఉండే అవకాశం ఉన్నందున నీరు అవసరమైన రైతులు పంట పొలాలకు చివరి తడి పెట్టుకోవాలని సూచిస్తున్నారు. అంతేగాకుండా మూడో పంటగా పిల్లిపెసర, జొన్న, జీలుగ వంటి పంటలు వేసుకునే రైతులు మరో పర్యాయం తడిపెట్టుకుంటే మంచిదని సూచిస్తున్నారు.

చెరువులు నింపుకోవాలి



ఈ నెల 15న కాలువకు నీటి సరఫరా నిలిపివేస్తున్నాం. ఇప్పటికే మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపుకోవాలని ఆదేశాలిచ్చాం. వరి చేలకు ఇంకా సాగునీరు కావాలని రైతులు ఎక్కడా కోరలేదు. ఏదైనా చర్యలు తీసుకోవాల్సి వస్తే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటాం.

– పి.నాగార్జునరావు, జిల్లా నీటి సరఫరా అధికారి, భీమవరం

దాళ్వాకు అవసరం ఉండదు



దాళ్వా పంట మాసూళ్ల దశకు చేరుకున్నందున సాగునీటి అవసరం ఉండదు. ఈ నెల 15న కాలువలకు నీటి సరఫరా నిలిపివేస్తున్నందున ఎక్కడైనా రైతులు పంటకు చివరి తడి పెట్టాలంటే రెండు, మూడు రోజుల్లో అవకాశాన్ని ఉపయోగించుకోవాలి.

– వి.నారాయణరావు, ఏడీఏ, భీమవరం

సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

భీమవరం(ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లాలోని గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఎన్నుకున్నారు. అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా జి.రాజేష్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వై.సురేష్, జనరల్ సెక్రటరీగా ఎన్.సాయిరామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్‌గా పి.శివకుమార్ 10 మంది కార్యవర్గ సభ్యులతో అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజేష్ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు విపర్తి నిఖిల్ కృష్ణ ఆదేశాలతో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నామన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

క్లుప్తంగా

బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శిగా గవ్వ శ్రీనివాస్



గవ్వ శ్రీనివాస్‌ను అభినందిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా గవ్వ శ్రీనివాస్ ఎన్నికయ్యారని అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఏలూరు కస్తూర్బా బాలికల పాఠశాలలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యుల సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న సభ్యులు గత ఏడాది రాజీనామా చేసిన పూర్వపు కార్యదర్శి ఎంఎస్ శ్రీనివాస్‌కుమార్ స్థానంలో గవ్వ శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

16 నుంచి జాతీయ స్థాయి నాటిక పోటీలు

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణంలోని కళారంజని 12వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 16 నుంచి మూడు రోజులు జాతీయ స్థాయి తెలుగు నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కళారంజని వ్యవస్థాపక అధ్యక్షుడు జవ్వాది దాశరథి శ్రీనివాసరావు శుక్రవారం చెప్పారు. నాటిక పోటీలను గునుపూడి శ్రీసోమేశ్వర, జనార్దనస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేస్తున్నామని నాటిక పోటీలు ప్రారంభోత్సవం సందర్భంగా ఆకుల సాంబశివరావు, ఎస్.ఆంజనేయులునాయుడుకు సన్మానం, నటుడు, దర్శకుడు మహమ్మద్ ఖాజావలికి జవ్వాది సూర్యారావు స్మారక పురస్కారం, రచయిత సింహప్రసాద్‌కు దేవరకొండ బాలగంగాధర తిలక్ స్మారక కథా పురస్కారంతో సన్మానించనున్నట్లు చెప్పారు.

రేషన్ బియ్యం పట్టివేత

జంగారెడ్డిగూడెం: అక్రమంగా లారీలో తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లయిస్ అధికారులు పట్టుకున్నారు. తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెం నుంచి తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేటకు లారీలో 20 టన్నులు రేషన్ బియ్యం తరలిస్తున్నారు. రేషన్ బియ్యం తరలింపుపై అధికారులకు సమాచారం అందడంతో స్థానిక బైపాస్‌రోడ్డులో సివిల్ సప్లయిస్ అధికారులు తనిఖీ చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

తణుకు ప్రభుత్వాస్పత్రికి అవార్డుల పంట

- ఉత్తమ సేవలకు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రశంసలు
- రానున్న మూడేళ్లకు రూ. 45 లక్షల నిధులు



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి పలు విభాగాల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి అవార్డులు అందుకుంది. కేవలం 150 పడకల సామర్థ్యం ఉన్న ఈ ఆస్పత్రి 500 పైగా పడకల సామర్థ్యం ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులను వెనక్కి నెట్టి అవార్డులతో అందలమెక్కింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన తనిఖీల్లో భాగంగా ఈ అవార్డులు దక్కాయి. జాతీయ నాణ్యతా ప్రమాణాల ధ్రువీకరణ సంస్థ, లక్ష్య పేరుతో ఈ ఏడాది జనవరి 9 నుంచి 11 మధ్య ఢిల్లీ నుంచి వచ్చిన బృందం తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిని తనిఖీ చేసింది.

15 విభాగాల్లో పరిశీలన

ముఖ్యంగా ఆస్పత్రికి వస్తున్న రోగులకు అందుతున్న సత్వర సేవలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలకు సంబంధించి 15 విభాగాల్లో ప్రత్యేక బృందం పరిశీలన చేసింది. ఇందులో భాగంగా కన్సల్టెన్సీ, బ్లడ్ బ్యాంక్, అవుట్ పేషెంట్, ఇన్ పేషెంట్, మెటర్నిటీ, పీడియాట్రిక్, ఆపరేషన్ థియేటర్, పీపీ యూనిట్, ల్యాబ్, ఎస్ఎన్‌సీయూ, రేడియాలజీ, ఫార్మసీ, మార్చురీ, శానిటేషన్, సెక్యూరిటీ, హాస్పిటల్ పరిపాలన వంటి అంశాల్లో క్షేత్రస్థాయిలో వైద్య వర్గాలతోపాటు రోగుల నుంచి తీసుకున్న ఫీడ్ బ్యాక్‌కు అనుగుణంగా జాతీయ నాణ్యతా ప్రమాణాల ధ్రువీకరణ సంస్థకు సంబంధించి 92 మార్కులు, లక్ష్యలో 96 మార్కులు వచ్చాయి. తణుకు ఆస్పత్రి తర్వాతి స్థానంలో మదనపల్లి ఆస్పత్రి 87, 85 మార్కులతో నిలిచినట్లు వైద్యవిధాన పరిషత్ అధికారులు తెలిపారు.

మూడేళ్లకు రూ.45 లక్షలు

ఒక్కో బెడ్‌కు రూ.150 చొప్పున 150 బెడ్లకు ఏడాదికి రూ.15 లక్షల చొప్పున మూడేళ్లకు రూ.45 లక్షలు రానున్న రోజుల్లో తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రికి అందనున్నాయి. ఈ నిధులతో ఆస్పత్రికి అవసరమైన వసతుల రూపకల్పన చేయవచ్చని అధికారులు చెబుతున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం తణుకు ఆస్పత్రిలో వైద్యవర్గాలు సెలబ్రేషన్స్ చేసుకున్నాయి.

వైద్య సిబ్బందికి పూర్తి స్వేచ్ఛ



గత ప్రభుత్వ హయాంలో వైద్యాధికారులు, సిబ్బందిపై రాజకీయ వేధింపులు ఉండేవి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వైద్య సిబ్బందికి పూర్తి స్వేచ్ఛనిచ్చాం. ఆస్పత్రిలో ఎలాంటి వసతులు కావాల్సి ఉన్నా వెంటనే కల్పించి వైద్యులను అందుబాటులోకి తీసుకువచ్చాం. వైద్య సిబ్బంది ఎంతో కష్టపడి పనిచేస్తున్నారు.

– కారుమూరి నాగేశ్వరరావు, పౌరసరఫరాల శాఖ మంత్రి

సమష్టి కృషి ఫలితమే



వైద్యవర్గాల సమష్టి కృషి ఫలితంగా ఈ అవార్డులు దక్కాయి. వైద్యానికి ప్రభుత్వం అందిస్తున్న సహకారంతోపాటు వైద్యవర్గాలు ఎంతో కష్టపడి పనిచేయడంతోఅవార్డులు అందుకున్నాం. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఏ సౌకర్యం కావాలన్నా వెంటనే స్పందిస్తున్నారు.

– కె.శివప్రసాద్, తణుకు ఆస్పత్రి సూపరింటెండెంట్

ఘోర ప్రమాదం

త్రుటిలో బయటపడ్డ తండ్రీ కూతుళ్లు



కొయ్యలగూడెం బస్టాండ్ సమీపంలో ప్రమాదంలో నుజ్జయిన కారు

కొయ్యలగూడెం: స్థానిక బస్టాండ్ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి కుమార్తెలు త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. గురువారం రాత్రి రాజమండ్రి నుంచి జంగారెడ్డిగూడెం వస్తున్న షిఫ్ట్ డిజైర్ కారు ప్రమాదానికి గురైంది. కారుకి ముందు వెళ్తున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో కారు లారీ వెనుక భాగంలోకి దూసుకుపోయింది. కారు వెనుక వస్తున్న మరొక లారీ కారును వెనకనుంచి బలంగా ఢీకొంది. దీంతో మధ్యలో ఉన్న కారు నుజ్జునుజ్జయ్యింది. తుక్కయిన ఆ కారును చూస్తే అందులో ఉన్నవారు ప్రాణాలతో బయటపడడం అసాధ్యమంటారు. అయితే కారులో ఉన్న ఇద్దరికీ స్వల్ప గాయాలు కాగా వారు జంగారెడ్డిగూడెం వెళ్లిపోయారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో అసిస్టెంట్ లైన్‌మేన్ మృతి



మృతి చెందిన ధర్మేంద్ర కుమార్

ద్వారకాతిరుమల: విద్యుత్ షాక్‌తో స్తంభం పై నుంచి కింద పడి తీవ్ర గాయాలు పాలైన అసిస్టెంట్ లైన్‌మేన్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ ఘటన ద్వారకాతిరుమలలోని వీఆర్ఎం ఫంక్షన్‌హాలు వద్ద శుక్రవారం ఉదయం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లకు చెందిన పాతూరి వెంకట ధర్మేంద్ర కుమార్(44) ద్వారకాతిరుమల మండలం రాళ్లకుంటలో అసిస్టెంట్ లైన్‌మేన్‌గా, ద్వారకాతిరుమలలో ఇన్‌చార్జ్ అసిస్టెంట్ లైన్‌మేన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కొన్నాళ్లుగా మండలంలోని గొల్లగూడెంలో ఉంటున్నాడు. ఉదయం ఒక ఇంటికి కరెంటు సరఫరా నిలిచిపోవడంతో మరమ్మతుల నిమిత్తం ధర్మేంద్ర కుమార్ సబ్‌స్టేషన్‌లో ఎల్‌సీ తీసుకుని ఘటనా స్థలంలోని విద్యుత్ స్తంభం ఎక్కాడు. న్యూట్రల్ జంపర్ వైరును సరిచేస్తుండగా సంబంధిత గృహంలోని ఇన్వర్టర్ నుంచి విద్యుత్ సరఫరా రివర్స్ రావడంతో అతడు విద్యుత్ షాక్‌కు గురై, ఒక్కసారిగా స్తంభం పై నుంచి కింద పడిపోయాడు. దాంతో తీవ్ర గాయాలు పాలైన అతడిని విద్యుత్ శాఖ సిబ్బంది, స్థానికులు హుటాహుటీన ద్వారకాతిరుమల పీహెచ్‌సీకి తరలించి, ప్రథమ చికిత్స అందించారు. తలకు బలమైన గాయం కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్న ధర్మేంద్ర కుమార్‌ను 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. రెండు రోజుల క్రితం బెంగళూరులో చదువుకుంటున్న కుమారుడు సాయి సత్య కృష్ణకు ఫోన్ చేసి ఇంటికి రావాలని కోరడంతో అతడు శుక్రవారం గొల్లగూడెం వచ్చాడు. డ్యూటీకి వెళ్లొస్తాను.. అని కొడుక్కి చెప్పి వెళ్లిన కొద్ది సమయానికే విగతజీవిగా మారాడు.

● గడపగడపకు సంక్షేమం



తణుకు: 11వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న మంత్రి కారుమూరి



తాడేపల్లిగూడెం: మండలంలోని లింగారాయుడిగూడెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

ట్రిపుల్ ఐటీలో ఐఓటీ ఎక్స్‌పో-23



ట్రిపుల్ ఐటీలో ఏర్పాటు చేసిన ఐఓటీ ఎక్స్‌పో-23 పరిశీలిస్తోన్న ఏవో ప్రదీప్ తదితరులు

నూజివీడు: స్థానిక ట్రిపుల్‌ఐటీలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) ఎక్స్‌పో-23 ప్రారంభమైంది. దీనిలో భాగంగా అకడమిక్ బ్లాక్-1లో విద్యార్థులు రూపొందించిన పలు మోడల్స్‌ను ప్రదర్శించారు. ఈసీఈ విద్యార్థులు 150కి పైగా మోడల్స్‌ను ప్రదర్శించగా ఏవో ప్రదీప్, డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ ఆఫీసర్లు వెంకట్రావు, స్రవంతి, ఈసీఈ హెచ్‌ఓడీ పీ శ్యామ్, పలువురు అధ్యాపకులు మోడల్స్‌ను వీక్షించారు. మోడల్స్‌ను ప్రదర్శించిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు తయారు చేసిన మోడల్స్‌లో సురక్షిత ఎలక్ట్రిక్ వాహనాలు, సమర్థవంతమైన నీటి నిర్వహణ, ఆటోమేటిక్ గ్రీన్‌హౌస్ మానిటరింగ్ సిస్టమ్, వేలిముద్ర ఆధార ఎలక్ట్రానిక్ ఓటింగ్ పరికరం, అటానమస్ అక్వాకల్చర్ మానిటర్, స్మార్ట్ అగ్రికల్చర్, అడ్వాన్స్‌డ్ ఫేస్ రికగ్నేషన్ లాక్ తదితర ప్రాజెక్టులున్నాయి.

వేటకు వెళ్లిన వ్యక్తి మృతి

యలమంచిలి: మండలంలోని బాడవ గ్రామానికి గోడి రామారావు ఈ నెల 12వ తేదీ బుధవారం రాత్రి గోదావరిలో వేటకు వెళ్లి ప్రమాదవశత్తు గోదావరిలో పడి మృతి చెందాడు. గురువారం రాత్రి మృతదేహం పైకి తేలడంతో మృతుడి తమ్ముడు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జాజుల విజయ్ నాగ ప్రసాద్ తెలిపారు.

ట్రాక్టర్ అదుపు తప్పి డ్రైవర్ మృతి



ప్రమాద స్థలంలో కొండయ్య మృతదేహం

కొవ్వూరు: ట్రాక్టర్ అదుపు తప్పి డ్రైవర్ మృతి చెందిన ఘటన కొవ్వూరు మండలం ఐ.పంగిడి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. కొవ్వూరు రూరల్ ఎస్సై కథనం ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం దండగర్రకు చెందిన ఎలిగంటి కొండయ్య (47) శుక్రవారం ఉదయం ఐ.పంగిడి సమీపంలోని ఒక క్రషర్‌లో మెటల్ లోడ్ వేసుకుని వెళ్తున్నాడు. రోడ్డు పక్కనే ఉన్న సబ్బు వల్ల ట్రాక్టర్ అదుపు తప్పింది. ప్రమాదంలో డ్రైవర్ కింద పడిపోయాడు. ట్రాక్టర్ ట్రక్కు అతనిపై ఎక్కడంతో అక్కడికక్కడే మరణించాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కట్నం కోసం వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

భీమవరం అర్బన్: అదనపు కట్నం తీసుకురమ్మని వేధిస్తున్న భర్తపై భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గూట్లపాడుకు చెందిన ఆరేటి లీలా అంజనికి ఆరేటి సత్య గోపి కిరణ్‌తో 2021లో వివాహమైంది. అప్పట్లో లీలా అంజని తల్లిదండ్రులు పసుపు కుంకుమల కింద కొంత సొమ్మును ముట్టచెప్పారు. ఇటీవల కిరణ్, అతని తల్లిదండ్రులు అంజనిని అదనపు కట్నం తీసుకు రమ్మని వేధిస్తున్నారని, ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చేపల చెరువులో విషప్రయోగం

ఉంగుటూరు: నీలాద్రిపురం పంచాయతీ చేపల చెరువులో విషప్రయోగం జరగడంతో చేపలు మరణించాయి. గుర్తు తెలియని వ్యక్తులు విషం కలపడం వల్ల ఈ ఘటన జరిగి ఉండొచ్చని చెరువు పాటదారుడు సీహెచ్ జీవరత్నం తెలిపారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

- ఉద్యాన వర్సిటీ యాక్షన్ ప్లాన్
- ఏడాది పొడవునా అవగాహన కార్యక్రమాలు



మిల్లెట్స్‌పై క్షేత్రస్థాయి పర్యటనలో విద్యార్థులు



మిల్లెట్లతో తయారుచేసిన జంతికలు

తాడేపల్లిగూడెం: మన ఆరోగ్యంలో చిరుధాన్యాల ప్రాధాన్యాన్ని గుర్తించిన కేంద్రం ఈ ఏడాదిని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఐసీఏఆర్, భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థతో డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ క్రమంలో ఉద్యాన వర్సిటీ 43 సంస్థల ద్వారా ఉద్యాన పంటల మేళవింపుతో హార్టీ మిల్లెట్ ఉత్పత్తుల రూపకల్పన చేపడుతోంది. ఈ మేరకు ఉద్యానవర్సిటీ ఉపకులపతి డాక్టర్ తోలేటి జానకీ రామ్ పర్యవేక్షణలో ప్రత్యేక క్యాలెండర్‌ను తయారు చేశారు. గత మూడు నెలలుగా ప్రారంభ దశలో ఉన్న కార్యక్రమాలు ఈ నెల నుంచి క్షేత్రస్థాయికి చేరుతున్నాయి.

పండ్లు, కూరగాయలతో బిస్కెట్లు

చిరు ధాన్యాలకు పండ్లు, కూరగాయలు మిళితం చేసి బిస్కెట్లు, స్నాక్స్, కేకులు వంటి పదార్థాల తయారీ చేపడుతున్నారు. వీటి తయారీపై మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. కేవీకే ద్వారా శిక్షణ ఇచ్చి మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నారు. వరి, గోధుమలకు ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలను ఆహారంలో తీసుకోవడం ద్వారా సరైన పోషకాలు, పీచు పదార్థాలు శరీరానికి లభిస్తాయి. చిరుధాన్యాలతో ఉత్పత్తులు తయారు చేయడానికి సాగులో నూతన విధానాలతో పాటు యంత్రాలు, ఉపకరణాలు రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఉద్యాన వర్సిటీ ఒప్పందాలు కుదుర్చుకుంది. డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని హాస్టళ్లలో చిరు ధాన్యాల ఆహారం అందించనున్నారు.

చిరుధాన్యాల సాగుపై రైతులకు శిక్షణ

అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ఈ ఏడాదిని ప్రకటించిన నేపథ్యంలో.. జనవరిలో చిరుధాన్యాలపై వెబినార్, ఫిబ్రవరిలో విద్యార్థులకు అవగాహన, మార్చిలో చిరుధాన్యాల పండుగను ఏర్పాటు చేశారు. ఏప్రిల్‌లో మిల్లెట్ హార్టీ ఉత్పత్తుల తయారీపై నైపుణ్య శిక్షణ, జూన్‌లో ఐసీఏఆర్, ఐఐఎంఆర్ హైదరాబాద్‌కు రైతుల సందర్శన యాత్ర ఉంటుంది. జులైలో కేవీకేలలో చిరుధాన్యాల పంటల ప్రదర్శన క్షేత్రస్థాయిలో ఏర్పాటుచేస్తారు. ఆగస్టులో చిరుధాన్యాల సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి. సెప్టెంబరులో చిరుధాన్యాల మేళా, అక్టోబరులో చిరుధాన్యాల పండుగ, నవంబరులో మిల్లెట్ హార్టీ ఉత్పత్తులపై అడ్వాన్స్‌డ్ శిక్షణా కార్యక్రమం, డిసెంబర్‌లో చిరుధాన్యాల వెబినార్ నిర్వహించడానికి కార్యాచరణ రూపొందించారు.

చిరుధాన్యాలకు అనుకూలం



ఉద్యాన పంటల సాగు చేసే రైతులకు అంతర పంటలుగా చిరుధాన్యాల సాగు చక్కటి అవకాశం. రాగులు, కొర్రలు, సామలు, జొన్నలు వంటి చిరుధాన్యాల సాగుకు ఇక్కడి వాతావరణం అనుకూలం. చిరుధాన్యాల సాగుతో తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయాలు పొందవచ్చు. చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేయడం లాభదాయకం.

– డాక్టర్ తోలేటి జానకీరామ్, ఉపకులపతి, ఉద్యాన వర్సిటీ

మహిళా ఉద్యోగిని దూషించిన వ్యక్తిపై కేసు

భీమడోలు: సచివాలయ మహిళా ఉద్యోగిని దూషించిన ఓ వ్యక్తిపై భీమడోలు పోలీసులు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. మండలంలోని కోరుకొల్లుకు చెందిన దాట్ల బలరామరాజుకు రెండేళ్ల కితం ఇంటి స్థలం మంజూరైంది. నేటికీ ఇంటి నిర్మాణం ప్రారంభించకపోవడంతో బలరామరాజుకు సచివాలయ మహిళా ఇంజినీరింగ్ అసిస్టెంట్ దీప ఫోన్ చేసింది. ఇంటి నిర్మాణం జాప్యానికి కారణం అడిగింది. దీంతో బలరామరాజు మహిళా ఉద్యోగినిని దూషించాడు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చావా సురేష్‌కుమార్ తెలిపారు.

16న గ్రామ రెవెన్యూ అధికారుల కార్యవర్గం ఎన్నిక

సాక్షి, భీమవరం: జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల నూతన కార్యవర్గ ఎన్నిక ఈనెల 16న భీమవరంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రాంబాబు శుక్రవారం చెప్పారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు పట్టణంలోని త్యాగరాజ భవనంలో ఎన్నికలు జరుగుతాయని ఎన్నికల అధికారిగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎం.బాపూజీ, సహాయ ఎన్నికల అధికారిగా ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీరామచంద్రమూర్తి వ్యవహరిస్తారని తెలిపారు.

నేరాల నిరోధానికి ప్రత్యేక చర్యలు

ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూనే మరోవైపు నేరాల నిరోధానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి చెప్పారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు పోలీస్ సబ్ డివిజన్లతోపాటు కైకలూరు సర్కిల్‌లోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో విజిబుల్ పోలీసింగ్, వాహన తనిఖీలు, రాత్రివేళల్లో జాతీయ రహదారులపై వాహన చోదకులకు వాష్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలను చేపట్టారు. రెండు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా 1497 కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో నేరస్తులపై నిత్యం నిఘా ఉంచటంతోపాటు, నేరాలను అడ్డుకునేందుకు తనిఖీలు, విజిబుల్ పోలీసింగ్ దోహదం చేస్తాయని చెప్పారు. మోటారు సైకిల్‌పై ప్రయాణించేవారు విధిగా హెల్మెట్ ధరించాలని, విలువైన ప్రాణాలను రక్షించుకునేందుకు హెల్మెట్ ఒక్కటే మార్గమన్నారు.

క్లుప్తంగా

స్నేహానికి ఆదర్శం ఇఫ్తార్ విందు


పెద్దమసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: కులమతాల రహితంగా స్నేహానికి ఆదర్శం ఇఫ్తార్ విందు అని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక పెద్ద మసీదులో ఏర్పాటు చేసి ఇఫ్తార్ విందుకు మంత్రి కొట్టు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొట్టు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రంజాన్ మాసంలో ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందును తీసుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ముస్లిం సోదరులు రంజాన్‌మాసంలో పేదవారికి చేసే సేవలు ఆచరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో మసీదు పెద్దలు, ముస్లిం నాయకులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రం సుభిక్షం


చింతపల్లి గ్రామంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు

తణుకు టౌన్: మండలంలోని నువ్వే మా నమ్మకం జగన్ కార్యక్రమాన్ని బుధవారం వివిధ గ్రామాల్లోని గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు నాయకులు ఉత్సాహంగా నిర్వహించారు. శుక్రవారం రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు ఆదేశాల మేరకు ఎంపీపీ రుద్ర ధనరాజులు గ్రామాల్లో నువ్వే మా నమ్మకం జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తణుకు రూరల్ మండలం వేల్పూరు, దువ్వ, తేతలి, మండపాక, మహాలక్ష్మీ చెరువు, యర్రాయి చెరువు, ముద్దాపురం, కోనాల గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో గృహ సారథులు, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెంటపాడు: సుస్థిర పాలన అందించడం ద్వారానే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించగల సత్తా ఉన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అని పెంటపాడు ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సూరిబాబు పేర్కొన్నారు.రావిపాడులో సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, సొసైటీ అధ్యక్షుడు దేవ వెంకటరమణ, మీనవిల్లూరు, రాచర్ల గ్రామాల్లోని పార్టీ నాయకులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో జిల్లా గవర్నర్ అధికారిక పర్యటన శుక్రవారం బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో అధ్యక్షుడు కోనా హనుమాన్ ఆధ్వర్యంలో జరిగింది. సేవా మహోత్సవాల్లో భాగంగా విద్యార్థినీలకు ఉచితంగా సైకిల్స్, కళాకారులకు బియ్యం బస్తాలు, పేద విద్యార్థులకు నగదు, బుక్స్, స్టీల్ సామాన్లు, విరాళాలు అందజేశారు. గవర్నర్ పంక జాక్సన్‌కు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పేరిచర్ల మురళీకృష్ణంరాజు, గట్టిం మాణిక్యాలరావు, వెంకట స్వామి, సూర్యనారాయణరాజు, వట్టిప్రోలు రాము, ఎంవీ రమణ, లియో క్లబ్ సభ్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలి

తణుకు: అగ్నిప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని ముఖ్యంగా గృహిణిలు వంటగదుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ఉండాలని తణుకు తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ పేర్కొన్నారు. తణుకు అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిధి గా పాల్గొని మాట్లాడారు. ఎంపీడీవో టి.సూర్యనారాయణ మూర్తి, లీడింగ్ ఫైర్ మేన్లు జీడీఈవీ ప్రసాద్, కేవీ అప్పారావు, ఎ.అప్పారావు, డ్రైవర్ ఆపరేటర్లు ఎస్.అచ్చిబాబు, ఎం.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అత్తిలి: అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తుగా తగిన జాగ్రత్తలు పాటించాలని అత్తిలి అగ్నిమాపక అధికారి సీహెచ్ రాజన్‌రాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అత్తిలి ఫైర్‌స్టేషన్‌లో అగ్నిప్రమాదాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. స్థానిక ప్రముఖులు బీటీకే ప్రసాద్, లింగం సురేష్, మంతెన భాస్కరరావు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

తాడేపల్లిగూడెం రూరల్: క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంపీపీ పానుకుమాటి శేషులత అన్నారు. శుక్రవారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో సమ్మర్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక, ఎమ్పీటీసీ నాగు, వైఎస్సార్‌సీపీ నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, పానుకుమాటి శ్యామ్‌బాబు, గెడ్డం సతీష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలు స్ఫూర్తిదాయకం

మండలంలో వాడవాడలా అంబేడ్కర్ జయంతి వేడుకలు


ముద్దాపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు


అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు


రాచర్ల గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం


ఇరగవరంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం


ఉద్యానవర్సిటీలో జరిగిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో వీసీ టి.జానకీరామ్ తదితరులు


అంబేడ్కర్ జయంతి సభలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువ నేత కొట్టు విశాల్


బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి సభలో మాట్లాడుతున్న వక్తలు

తణుకు టౌన్: భారతరత్న డా.బీఆర్.అంబేడ్కర్ సమాజానికి అందించిన సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం అంబేడ్కర్ 132వ జయంతి సందర్భంగా మండలంలోని ముద్దాపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని రాష్ట్ర ఎస్సీ కమీషన్ సభ్యుడు చెల్లెం ఆనంద ప్రకాష్‌తో కలసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేడ్కర్ స్ఫూర్తితో రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా విజయవాడ స్వరాజ్ మైదానంలో 125 అడుగుల పొడవైన అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. దీనిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనంద్‌ప్రకాష్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహం గ్రామాల్లో మారు మూలన వుంటే ముద్దాపురం గ్రామంలో మాత్రం గ్రామంలోని మధ్యలో ఏర్పాటు చేయడం శుభ పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ గుబ్బల తమ్మయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, ఎంపీపీ రుద్ర ధనరాజు, గ్రామ సర్పంచ్ మజ్జి పద్మ, గ్రామ కమిటీ అధ్యక్షుడు తుమ్మగంటి నాగ సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు సైదు త్రిమూర్తులు, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు. తణుకు మండలంలోని వేల్పూరు, దువ్వ, తేతలి, మండపాక తదితర గ్రామాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు.

తాడేపల్లిగూడెం: కటికపేదరికంలో ఉండి, అంటరాని కులంలో పుట్టిన అంబేడ్కర్ పట్టుదలతో ఉన్నత విద్యలను అభ్యసించి ప్రపంచం గర్వించే భారత రాజ్యాంగానికి రూపకల్పన చేశారని ఉద్యానవర్సిటీ వీసీ టి.జానకీరామ్ అన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, అధికారులు ఎల్.నారంనాయుడు, డీవి.స్వామి,సలోమి సునీత, సూర్యకుమారి, మల్లికార్జునరావు, ఆనంద బాబు, మంగరాజు, శ్రీనివాసు, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీ నిట్ రిజిస్ట్రార్ దినేష్ పి.శంకరరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్‌లు డా.జీఆర్‌కె.శాస్త్రి, వీరేష్‌కుమార్, ఎస్.జయరామ్, ఆచార్యులు వి.సందీప్, కిరణ్‌తీపర్తి, వినోత్ కుమార్‌రాజా, తదితరులు పాల్గొన్నారు.

అత్తిలిలో..

అసమానతలపై పోరాటం చేసి, సామాజిక సమానత్వం కోసం కృషి చేసిన యోధుడు బీఆర్ అంబేడ్కర్ అని ఎంపీపీ మక్కా సూర్యనారాయణ చెప్పారు. రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతిని పురస్కరించుకుని అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, మండలపార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు, ఈవోఆర్డీ ఎం శ్రీనివాసరావు,మండల పరిషత్‌కార్యాలయ సిబ్బంది కె శ్రీనివాస్, ఏ రాజేంద్రకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు రంభ సూరిబాబు, కాసగాని అబ్బులు, కోరుకొల్లు వెంకట్రావు, చిటకన వెంకట్రావు, కొమ్మర రామారావు, రాయుడు ధర్మారావు తదితరులు పాల్గొన్నారు. అత్తిలి రాజరాజేశ్వరి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకలకు హాజరైన వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ దళిత వర్గాల సంక్షేమమే కాకుండా అన్ని వర్గాల ప్రజల ఉన్నతికి అంబేడ్కర్ కృషిచేసారని శ్లాఘించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంటావిజేత నాగరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇరగవరం : మండలంలోని అన్ని గ్రామాల్లో బాబా సాహెబ్ డాక్టర్ బి ఆర్ అంబేడ్కర్ 132వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఏలేటి పాడు , అయినపర్రు, గోటేరు, కె ఇల్లిందలపర్రు, అర్జునుడు పాలెం, కావలిపురంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇరగవరం ఎంపీడీవో కార్యాలయంలో జెడ్పీటీసీ పంపన అంజిబాబు, ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయరు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సచివాలయం దగ్గర ఉన్నా అంబేడ్కర్ విగ్రహానికి సర్పంచ్ కంకిపాటి శ్రీను పూలమాలలు వేసి నివాళులర్పించారు. కంతేరులో సర్పంచ్ గుడిమెట్ల ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుడి మెట్ల సత్యనారాయణ, సబ్బితి వెంకట్రావు, గ్రామ యువత, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. రేలంగిలో సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు పెద్దిరాజు, సచివాలయ సిబ్బంది,వైఎస్సార్ సీపీ నాయకులు బోస్, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడు: మండలంలో అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. జై భీమ్ యూత్ నాయకులు భారీ మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్యాంబాబు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెంటపాడు బస్టాండ్ సెంటర్‌లోని విగ్రహానికి పార్టీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి, ఎస్సీ నాయకులు తాడేపల్లి ఈశ్వరరావులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దర్శిపర్రులోని ఎస్సీ పేటలో జైభీమ్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. రావిపాడులో అంబేడ్కర్ జయంతిని సర్పంచ్ చాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని సీఐ నాగరాజు పేర్కొన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా రాచర్ల గ్రామంలో జనచైతన్యయూత్ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ దుర్గాభవానీ, ఎస్సై రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: సమానత్వ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువ నేత కొట్టు విశాల్ అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ 132వ జయంతిని శుక్రవారం మండలంలోని కుంచనపల్లి గ్రామంలో నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొట్టు విశాల్ మాట్లాడుతూ కుల వివక్ష, అంటరానితనం నిర్మూలనకు అంబేడ్కర్ ఎంతగానో కృషి చేశారన్నారు. ఆయన ఆశయసాధనకు నేటి యువత కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సోమసాయి ఏజెన్సీస్ అధినేత సీహెచ్‌ఎఆర్‌కె.వర్మ, జగన్నాథపురంలో ఎంపీపీ పానుకుమాటి శేషులత, సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక, నీలాద్రిపురంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎమ్పీటీసీ మట్టా సత్యనారాయణ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో అధికారి వానపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.బార్ అసోసి యేషన్ న్యాయవాదులు ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.నాగమల్లేశ్వరీ, రెండోవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి రమ్య, అసోసియేషన్ అధ్యక్షుడు అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మసీద్ సెంటర్ అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేద మహిళలకు చీరలు, కూరగాయలు పంపిణీ చేశారు. వాకర్స్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కేవీ చలం, కార్యదర్శి పి.కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. నాల్గోవ వార్డు, పదమూడోవార్డుల్లో అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేడపాటి వెంకట్, నాని, మాస బంగారయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని యాగర్లపల్లి కొత్త ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించారు. పట్టణ యువజన సంఘం అధ్యక్షుడు చల్లా సుధీర్, తుమరాడ చిన్న, మారిశెట్టి నరసింహమూర్తి, లక్ష్మణ్, బెనర్జీ, అప్పు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో మహిళలకు గౌరవం

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- లింగారాయడిగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం


తాడేపల్లిగూడెం మండలం లింగారాయడిగూడెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్రంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనలో మహిళలకు ఎంతో గౌరవం, ప్రాధాన్యత లభిస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం రాత్రి తాడేపల్లిగూడెం మండలం లింగారాయడిగూడెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏ పథకం ప్రవేశపెట్టినా అది మహిళల పేరున తీసుకురావడం వారికిచ్చే గౌరవమని పేర్కొన్నారు. ఆయా పథకాల ద్వారా మహిళలకు లక్షలాది రూపాయలు లబ్ధి చేకూరుతుందన్నారు. ఇంటిలోని చిన్నారుల విద్యకు ప్రాధాన్యతనిచ్చి సీఎం జగన్ వారిని చదివిస్తున్నారన్నారు. ఏనాడైనా చంద్రబాబు ఇటువంటి ఆలోచన చేశాడా?అని ప్రశ్నించారు. ఎప్పుడూ రాష్ట్రాన్ని దోచేయాలనే ఆలోచనే తప్ప మరో ఆలోచన చంద్రబాబుకు లేదన్నారు. నాడు చంద్రబాబు చేసిన దోపిడీయే ఆయనకు ఈ గతి పట్టించిందన్నారు. మరలా ఆయనకు ఓటేసేందుకు ప్రజలు వెనుకంజ వేస్తున్నారన్నారు. దీనికి నిదర్శనం గుడివాడ సమావేశమని పేర్కొన్నారు. ఎంపీపీ పానుకుమాటి శేషులత, వైస్ ఎంపీపీలు సూర్పని రామకృష్ణ, కట్టా రంగబాబు, ఎమ్పీటీసీలు వీరమళ్ళవెంకన్న, మార్లపూడి సుబ్బారావు, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్ర కుమార్, చిక్కాల సత్యనారాయణ, సచివాలయ కన్వీనర్ యాతం సత్యనారాయణ (పెద్దోడు), ఆర్‌బీకే చైర్మన్ ములగాల గంగారావు, తహసీల్దార్ వైకేవీ.అప్పారావు, ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వీఎస్.వేణుగోపాల్, ఏపీఎం జీవీకే డీఎం.లక్ష్మి, ఏపీవో ఏవీవీఎస్‌వి.ప్రసాద్, సచివాలయ కార్యదర్శిఅంకం శ్రీరామకృష్ణ, ఎలక్ట్రికల్ ఏఈ ఎ.రామకృష్ణ, హౌసింగ్ ఏఈ వైవి.వెంకట్రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఆర్.శ్రీనివాస్, పీఆర్ ఏఈ పవన్‌కుమార్, నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, సత్తినీడి కొండలరావు, బొద్దాని శ్రీనివాస్, ఆశాలు, ఏఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనను ఆశీర్వదించండి


తణుకులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కారుమూరి

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి
- 11వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

తణుకు అర్బన్: రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించాలని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు కోరారు. తణుకు 11వ వార్డులో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎటువంటి అవినీతికి తావులేకుండా పారదర్శకంగా మహిళల బ్యాంకు ఖాతాలకే సంక్షేమ లబ్ధిని జమచేయడాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని స్పష్టం చేశారు. పేద, ఎస్సీ, ఎస్టీ మైనారిటీలకు జగనన్న అందిస్తున్న చేయూతపై ప్రజానీకం సంతోషంగా ఉన్నారని తెలిపారు. విద్యా, వైద్యానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని ప్రజలు సంతోషిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా స్థానిక నివాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాల్సిందిగా మంత్రి కారుమూరి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ డీఈఈ కొవ్వూరి ఈశ్వర రెడ్డి, విద్యుత్ శాఖ డీఈఈ సీహెచ్ రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి వెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, అవినాష్, నారాయణ అప్పారావు, నార్గన సత్యనారాయణ, డోలా సింహాద్రినాయుడు, నత్తా కృష్ణవేణి, కుడిపూడి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ వ్యభిచారి ఎంపీ రఘురామకృష్ణరాజు


సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): జగనన్న కాళ్లు పట్టుకుని వైఎస్సార్ సీపీ టికెట్ తెచ్చుకొని నరసాపురం ఎంపీగా గెలిచిన రఘురామ కృష్ణరాజు టీడీపీ, జనసేన నాయకులతో అంట కాగుతూ రాజకీయ వ్యభిచారిగా మారారని వైఎస్సార్ సీపీ నాయకులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైసీపీ నాయకులు శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. పట్టణ అధ్యక్షుడు గుండుబోగుల నాగు, జిల్లా అధికార ప్రతినిధులు ముప్పిడి సంపత్‌కుమార్, కొలుకులూరి ధర్మరాజు, మాజీ కౌన్సిలర్లు పత్సమట్ల సావిత్రి, వెలనాటి సత్తిబాబు, సంపత్ కృష్ణారావులు మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర కలిగిన నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గాన్ని రఘురామ కృష్ణరాజు భ్రష్టు పట్టించారని విమర్శించారు. రఘురాం కృష్ణరాజు ఇక్కడికి వస్తే జనం కొడతారని భయపడి ఢిల్లీలో దాక్కుంటున్నారని అన్నారు. జగనన్న ఫోటోలు పెట్టుకుని ఎంపీగా గెలిచి తల్లి లాంటి పార్టీకి వెన్నుపోటు పొడిచి వైరీ వర్గంతో అంట కాగుతున్నారని విమర్శించారు. ఇలాంటి వ్యక్తినా మనం ఎంపీగా ఎన్నుకున్నదని అంటూ ప్రజలు రఘురామకృష్ణరాజును చూసి అసహ్యించుకుంటున్నారన్నారు. వైఎస్సార్ సీపీ టికెట్ పై గెలిచి జనసేన, తెలుగుదేశం నాయకులతో అంట కాగుతున్న రఘురామ కృష్ణరాజు, అలాగే జనసేన, టీడీపీలో ఉంటూ వైఎస్సార్ సీపీ ఎంపీతో వ్యవహారాలు నడుపుతున్న ఆ పార్టీ నాయకులు రాజకీయ వ్యభిచారులని తీవ్రస్థాయిలో విమర్శించారు. వైఎస్సార్ సీపీని గాని ఆ పార్టీ ప్రజా ప్రతినిధులను గాని పల్లెత్తు మాట అనే నైతిక అర్హత వారికి లేదన్నారు. ఈ నియోజకవర్గంలో జనసేన నాయకుడిగా ఉన్న వ్యక్తి చరిత్ర అందరికీ తెలుసునని పేర్కొన్నారు. ఇంకోసారి వైఎస్సార్ సీపీ గురించి గాని తమ నాయకుడి గురించి గానీ మాట్లాడితే తగిన గుణపాఠం చెప్తామని వారు హెచ్చరించారు.

పడాలలో ఫ్రైడే డ్రైడే

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పడాల గ్రామంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి. లక్ష్మణరావు మాట్లాడుతూ ఇంటి ఆవరణలో నీరు నిల్వ ఉన్న, తాగేసిన కొబ్బరి బొండాలు వంటి వాటిల్లో దోమలు వృద్ధి చెందుతాయన్నారు. దోమల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.